సాక్షి పార్వతీపురం మన్యం

మంగళవారం | 17 | అక్టోబర్ | 2023



విద్యుత్ శాఖలో మరింత పర్యవేక్షణ

విద్యుత్‌శాఖలో పర్యవేక్షణ పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పర్యవేక్షణ చేసేందుకు వీలుగా విజయనగరంలో కొత్తగా డివిజన్‌ను ఏర్పాటు చేసింది. - 10లో



ముగిసిన లీగ్ మ్యాచ్‌లు

జీసీసీఐ ఆధ్వర్యంలో గ్రూప్‌-ఈ విభాగంలో ఈ నెల 8 నుంచి జరుగుతున్న అంతర్ రాష్ట్ర అండర్‌- 19 మహిళల వన్డే క్రికెట్ టోర్నీలో లీగ్ మ్యాచ్‌లు ముగిశాయి. - 10లో



మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలి

మొక్కలు నాటడాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీ బెల్లానచంద్రశేఖర్ పిలుపునిచ్చారు. - 10లో

న్యూస్‌రీల్

వేగవంతంగా గృహ నిర్మాణాలు

పార్వతీపురం: గృహనిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాధాన్యతా పనులను సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. పౌష్టికాహార లోపం, రక్తహీనత నివారణకు మండల అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వం అందజేసే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందజేయాలన్నారు. సమావేశంలో జేసీ గోవిందరావు, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, డీఎంఅండ్‌హెచ్‌ఓ బి.జగన్నాథరావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, డీపీఓ బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత జిల్లాయే లక్ష్యం

● డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్



బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

పార్వతీపురంటౌన్: బాల్యవివాహ రహిత జిల్లాగా పార్వతీపురం మన్యం జిల్లాను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుదామని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సిబ్బందితో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలపై ఎటువంటి సమాచారం అందినా తక్షణమే తమ సమీప పోలీస్‌స్టేషన్, సచివాలయంలో అందజేయాలన్నారు. మూఢనమ్మకాలపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు ప్రతివారం క్రమంతప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. లింగ వివక్షతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆయన సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తామంటూ మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు.

నేడు ఐఈఆర్పీ పోస్టులకు స్కిల్ టెస్ట్

విజయనగరం అర్బన్: జిల్లాలోని భవిత కేంద్రాల ఐఈఆర్పీ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్‌లో ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూ, స్కిల్‌టెస్ట్‌ను జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో నిర్వహిస్తామని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులను 1:3 నిష్పత్తిలో ఎంపిక చేసిన మెరిట్ జాబితాను 'డీఈఓ.విజయనగరం' వెబ్ సైట్‌లో, జిల్లా కేంద్రంలోని సమగ్ర శిక్ష కార్యాలయం నోటీస్‌బోర్డులో ప్రదర్శనకు ఉంచుతామన్నారు.

ఆర్టీసీలో ముగిసిన 13వ బ్యాచ్ హెవీ డ్రైవింగ్ శిక్షణ

విజయనగరం అర్బన్: ఆర్టీసీ సిబ్బంది శిక్షణ కళాశాలలో 13వ బ్యాచ్ అభ్యర్థులకు హెవీ డ్రైవింగ్ శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ మాట్లాడుతూ సుశిక్షితులైన ఆర్టీసీ బోధకుల వద్ద పొందిన శిక్షణతో భవిష్యత్తులో మంచి డ్రైవర్లుగా గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం శిక్షణ ధ్రువపత్రాలను అభ్యర్థులకు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్, డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వారం రోజుల్లో ప్రారంభం కానున్న 14వ బ్యాచ్‌లో శిక్షణ పొందేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఫోన్: 73829 24030 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు 12 చోట్ల వైద్యశిబిరాలు

పార్వతీపురంటౌన్: జిల్లాలో 12 చోట్ల మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహిస్తామని డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు తెలిపారు. శిబిరాలను ఆయా ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీహెచ్‌సీ	శిబిరం నిర్వహించే ప్రాంతం
పాచిపెంట	కొత్తవలస విలేజ్ హెల్త్ క్లినిక్
గళావల్లి	అంపావల్లి ఎంపీయూపీ పాఠశాల
భామిని	నేరడి గ్రామ సచివాలయం
దుండుకల్లు	బీరపాడు ఎంపీపీ స్కూల్
నీలకంఠాపురం	పాడిన జీటీడబ్ల్యూఏ హెచ్ పాఠశాల
శంబర	చెముడుఎంపీయూపీ స్కూల్
కుసుమి	వెలగాడ సచివాలయం
బాగువలస	పెదబోర బంద సచివాలయం
అరసాడ	దయానందపురం సచివాలయం
బిటివాడ	తూడి సచివాలయం
కొమరాడ	గుణానపురం సచివాలయం
సాలూరు అర్బన్	ప్రభుత్వ జూనియర్ కళాశాల

● కుంకుమ పూజ





దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా సాలూరులోని కామాక్షమ్మ, పంచముఖేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. కామాక్షమ్మ ఆలయంలో అమ్మవారిని 108 చీరలతో అలంకరించారు. సామూహిక కుంకుమపూజలు జరిపి అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. - సాలూరు

నవంబర్ 8న రైల్వేలో ప్రత్యేక అదాలత్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో పెండింగ్ కారుణ్య నియామక పెన్షన్ కేసులకు సంబంధించి నవంబర్ 8న ప్రత్యేక అదాలత్ నిర్వహిస్తామని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి సోమవారం తెలిపారు. దొండపర్తి డీఆర్‌ఎం కార్యాలయంలోని సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అదాలత్ ఉంటుందన్నారు. మరణించిన రైల్వే అధికారులు, పింఛన్‌దారుల వివరాలను ఎ-4 పేపర్‌పై రాసి.. తగిన ఫార్మాట్‌లో అక్టోబర్ 31లోగా డివిజనల్ రైల్వే మేనేజర్(పి), మొదటి అంతస్తు, డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం కాంప్లెక్స్, దొండపర్తి చిరునామాకు పంపించాలన్నారు. కవరుపై కారుణ్య అదాలత్- 2023/ఈస్ట్‌కోస్ట్ రైల్వే/వాల్తేర్ అని కచ్చితంగా రాయాలని సూచించారు.

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల మదింపునకు..

'నాస్' సర్వే



అభ్యసనలో నిమగ్నమైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

- 3, 6, 9 తరగతుల విద్యార్థులకు సామర్థ్య నిర్ధారణ పరీక్ష
- నవంబర్ 3న పాఠశాలల్లో సర్వే
- ముందస్తు ప్రాక్టీస్ పరీక్షలకు క్షేత్రస్థాయిలో ముమ్మర కసరత్తు

పాలకొండ రూరల్:

విద్యార్థుల ఉజ్వలభవితే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టాయి. ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యాలను తరగతి వారీగా మదింపు చేసే ప్రక్రియ నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్‌-నాస్)ను వచ్చేనెల 3వ తేదీ నుంచి నిర్వహించనున్నాయి. ప్రతి మూడేళ్లకోసారి నాస్ సర్వే నిర్వహిస్తాయి. చివరగా 2021లో జరిపాయి. తాజాగా 2024లో నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశాయి. దీని ఆధారంగా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు, ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని అంచనా వేసి, విద్యాప్రణాళికలు అమలుచేస్తాయి. నాస్ సర్వేకు ముందుకు స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వేను మండల స్థాయిలో చేపట్టనున్నాయి.

ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల ఎంపిక

స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే(సీస్)లో భాగంగా క్షేత్ర స్థాయిలో పరీక్ష నిర్వహించేందుకు ఆయా మండలాలకు ఎంత మంది ఎఫ్‌ఐలు అవసరమనేది జిల్లా విద్యాశాఖ నిర్ధారణకు వచ్చింది. ఎఫ్‌ఏఐలుగా ఛాత్రోపాధ్యాయులు, డిగ్రీ చదువుతున్న విద్యార్థులను నియమించి శిక్షణ ఇవ్వనుంది. సర్వే పరీక్ష వీరి పర్యవేక్షణలోనే జరుగుతుంది. జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో జరగనున్న పరీక్షలను డీసీఈబీ సెక్రటరీ, సమగ్ర శిక్ష ఏఎంఎ, డైట్ ప్రిన్సిపాల్/లెక్చరర్, డీఈఓ కార్యాలయ ప్రతినిధి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ పరిశీలిస్తారు. మండల స్థాయిలో పరీక్షల నిర్వాహకులుగా మండల విద్యాశాఖాధికారులు 1, 2తో పాటు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు వ్యవహరిస్తారు. ఈ పరీక్షకు ముందుగా విద్యార్థులకు ఎస్సీఈఆర్టీ అధ్వర్యంలో ప్రాక్టీస్ పరీక్షల ద్వారా ఉపాధ్యాయులు సన్నద్ధం చేయాల్సి ఉంది. గతంలో నిర్వహించిన సర్వేలో భాగంగా మూడు, ఐదు, ఎనిమిది తరగతులకు పరీక్షలు నిర్వహించగా, ఈ ఏడాది సీస్ సర్వేలో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఎస్‌సీఈఆర్‌టీ నుంచి ఎంపిక చేసిన పాఠశాలల్లోనే ఈ పరీక్షలు నిర్వహిస్తారు. వీటి నిర్వహణకు ఎస్‌సీఈఆర్‌టీ ముందుగా సరఫరా చేసిన ప్రాక్టీస్ పేపర్లతో తర్ఫీదు ఇస్తారు. తద్వారా సీస్ పరీక్షలను విద్యార్థులు సమర్థవంతంగా రాసే అవకాశం ఉంటుంది. పూర్తిగా ఓఎంఆర్ షీట్ విధానంలో పరీక్ష ఉంటుంది. 3, 6 తరుగతుల విద్యార్థులకు తెలుగు/ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానం, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు/ఇంగ్లిష్, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టులపై పరీక్ష నిర్వహిస్తారు.

జిల్లాలో సాధన సర్వే ఇలా....

మండలాలు	పాఠశాలలు	ఇన్వెస్టిగేటర్లు	స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు
బలిజిపేట	30	33	2
భామిని	33	36	2
జీ.ఎల్.పురం	38	42	2
గరుగుబిల్లి	32	35	2
జీయమ్మవలస	33	36	2
కొమరాడ	31	34	2
కురుపాం	39	43	2
మక్కువ	31	34	2
పాచిపెంట	28	31	1
పాలకొండ	49	54	2
పార్వతీపురం	52	57	3
సాలూరు	49	54	2
సీతంపేట	38	42	2
సీతానగరం	30	33	2
వీరఘట్టం	39	43	2

ఎంపిక చేసిన పాఠశాలల్లో...

ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో సర్వే నిర్వహిస్తారు. 3, 6, 9 తరగతుల విద్యార్థులకు పరీక్ష జరుగుతుంది. 3వ తరగతి విద్యార్థులకు అదే తరగతికి సంబంధించిన సిలబస్, 6వ తరగతి విద్యార్థులకు 5వ తరగతికి సంబంధించిన సిలబస్, 9వ తరగతికి విద్యార్థులకు 8వ తరగతి సిలబస్‌పై పరీక్ష ఉంటుంది. 3, 6 తరగతులు విద్యార్థులకు లాంగ్వేజ్, గణితం, ఈవీఎస్, 9వ తరగతి విద్యార్థులకు లాంగ్వేజ్, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుపై పరీక్షలు నిర్వహిస్తారు. 3, 6 తరగతులవారికి 40 ప్రశ్నలకు 60 నిమిషాల సమయం, 9వ తరగతి విద్యార్థులకు 60 ప్రశ్నలకు 90 నిమిషాల వ్యవధిలో సమాధానాలు రాయాల్సి ఉంటుంది. జిల్లాలో 552 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన ఫలితాలు (లెర్నింగ్ అవుట్‌కమ్స్)ఆధారంగా అభ్యసనా సామర్థ్యాలు మదింపు చేయనున్నారు. పరీక్షల నిర్వహణకు డిగ్రీ చదువుతున్న 607 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల (ఎఫ్‌ఐ)ను ఎంపిక చేస్తారు. వీరికి జిల్లాస్థాయి కోఆర్డినేటర్ల ద్వారా శిక్షణ అందిస్తారు. ప్రతి శనివారం అన్ని యాజమాన్య పాఠశాలల్లో ప్రత్యేక ప్రాక్టిస్ పరీక్షలు చేపట్టి విద్యార్థులను సిద్ధం చేయాల్సి ఉంటుంది.

విద్యార్థుల ఉజ్వల భవితే లక్ష్యం



నాసా సర్వేతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మదింపు జరుగుతుంది. విద్యార్థుల్లో అవగాహనా శక్తిని అంచనా వేసేందుకు ఈ సర్వే ఉపకరిస్తుంది. సర్వే ఫలితాలను బట్టి తగిన బోధనాభ్యసన ప్రణాళికలను రూపొందిస్తారు. సర్వేను జిల్లా కమిటీ పర్యవేక్షిస్తుంది. సర్వేలో భాగంగా విద్యార్థులకు నిర్వహించే పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. సర్వేను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేశాం. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల (ఎఫ్‌ఎఐ) నియామకానికి చర్యలు చేపడుతున్నాం. త్వరలోనే ఎఫ్‌ఐలకు జిల్లా స్థాయిలో శిక్షణ అందిస్తాం. ఇప్పటికే అన్ని పాఠశాల్లో విద్యార్థులకు ఈ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ముమ్మర కసరత్తు చేపడుతున్నాం. విద్యార్థుల ఉజ్వల భవితే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

- ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

సీతంపేటలో నైపుణ్య శిక్షణ కళాశాల

● కలెక్టర్ నిషాంత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేటలో త్వరలో నైపుణ్య శిక్షణ కళాశాలను ప్రారంభించనున్నట్టు కలెక్టర్ నిషాంత్ కుమార్ తెలిపారు. కళాశాల ప్రారంభోత్సవంపై సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్‌హబ్‌ను ఏర్పాటుచేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. స్కిల్ హబ్‌లను కురుపాం, పార్వతీపురం, పాలటెక్నిక్ కళాశాలల్లోను, సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్కిల్ హబ్‌లు, నైపుణ్య కళాశాలలో శిక్షణ భాగస్వామ్య సంస్థల సౌజన్యంతో పరిశ్రమల అవసరాలు తీర్చేలా మానవ వనరులను తీర్చిదిద్దుతామన్నారు. స్కిట్ డేటా ఎంట్రీ, ఫ్రెంట్‌ఆఫీస్ ఎగ్జిక్యూటివ్, కమర్షియల్ రిలేషన్‌షిప్ మేనేజర్, ఎలక్ట్రీషియన్, స్కిట్ సొల్యూషన్, స్యూయింగ్ మిషన్ ఆపరేటర్, అసిస్టెంట్ ప్లంబర్, క్రెడిట్ ప్రాసెసింగ్ ఆఫీసర్, ఫిట్టర్, ఫుడ్ అవుట్‌లెట్ మేనేజర్, స్టాఫ్ డెవలపర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. స్కిల్ హబ్‌లలో శిక్షణకు అభ్యర్థులు పేర్లు నమోదుచేసుకోవాలని సూచించారు. జిల్లాలో కనీసం 25వేల మంది యువతకు శిక్షణ ఇవ్వాలన్నది లక్ష్యంగా పేర్కొన్నారు. ఇప్పటివరకు 9,039 మంది పేర్లు నమోదు చేసుకున్నట్టు వెల్లడించారు. నైపుణ్య సంస్థలలో ఈ ఏడాది శిక్షణ పొందిన యువతకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

20న పార్వతీపురంలో మెగా జాబ్‌మేళా

పార్వతీపురంలో ఈ నెల 20న మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా జాబ్‌మేళా జరుగుతుందన్నారు. దీనిని జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేసీ గోవిందరావు, ఐటీడీఏ పీఓ సి. విష్ణుచరణ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎండీ గయాజుద్దీన్, బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవీ కరుణాకర్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలన తెలిపేలా సామాజిక బస్సు యాత్ర

● వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి



పార్టీ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలతో సమావేశమైన వై.వి.సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్ల పాలనలో అందించిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించడానికి తలపెట్టిన సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఎండాడ లా కాలేజీ సమీపంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో తొలి విడత 'సామాజిక బస్సు యాత్ర' ప్రారంభం కానుందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ.. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతిని, మేనిఫెస్టోలో హామీలను విస్మరించి ప్రజలను మోసగించిన విధానాన్ని తెలియచెప్పాలన్నారు. సమావేశంలో పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, అల్లూరి జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పెట్ల ఉమాశంకర్ గణేష్, గొల్ల బాబూరావు, కన్నబాబురాజు, చెట్టి పాల్గుణ, అప్పలనాయుడు, ఎమ్మెల్సీ రఘురాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రోత్సాహం

- బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌కు వెళ్లే రోడ్ల అభివృద్ధికి సన్నాహాలు
- 'ఐలా' నిధులతో పనులు
- రామకృష్ణాపురంలో ఏపీఐఐసీ లే అవుట్
- 60 ఎకరాల్లో అరఎకరా చొప్పున 70 ప్లాట్లు



గ్రోత్ సెంటర్

బొబ్బిలి: ఉత్తరాంధ్రలో పరిశ్రమల ఏర్పాటుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధచూపుతోంది. పరిశ్రమలకు అనువైన చోట భూములు కొనుగోలుచేసి ప్లాట్లు వేస్తోంది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్లాట్లను కేటాయిస్తోంది. ఇప్పటికే ఉన్న పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి కృషిచేస్తోంది. ఉత్తరాంధ్రలో చిన్నతరహా పరిశ్రమలు ఎక్కువ గా ఉన్నది బొబ్బిలి గ్రోత్ సెంటర్ ప్రాంతం. ఇక్కడ దాదాపు 300కు పైగా ప్లాట్లు ఉన్నాయి. దాదాపు 30 ఏళ్ల కిందట ఇక్కడ నిర్మించిన ప్రధాన, అంతర్గత రోడ్లు మరమ్మతులకు గురయ్యాయి. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలాచోట్ల రోడ్లు ప్రమాదకరంగా మారాయి. నారాయణప్పవలస వెళ్లే ప్రధాన రోడ్డు, ఎం.బూర్జివలస, గున్నతోటవలస, మెట్టవలస ప్రాంతాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. వీటిని ఐలా (ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ) నిధులతో బాగుచేసేందుకు ఏపీఐఐసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నా రు. పరిశ్ర,మలకు నీటిని సరఫరా చేసే మోటార్లు, స్లంప్‌లను కూడా బాగుచేయనున్నారు. వివిధ రకాల అభివృద్ధి పనులకు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఎంఎస్ఈ డీపీ (మైక్రో స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ అండ్ డవలప్‌మెంట్ ప్రొగ్రాం) కింద గ్రోత్ సెంటర్ అభివృద్ధికి రూ.5 కోట్లు అవసరంగా పేర్కొన్నారు. ఈ నిధులు వచ్చేలోగా 'ఐలా' కింద పన్నుల రూపంలో వసూలవుతున్న నిధులను వెచ్చించి మరమ్మతులు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. దీంతో పరిశ్రమల యజమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు దశాబ్దాల తరబడి గ్రోత్‌సెంటర్‌లో రోడ్లు, డ్రెయినేజీలు మరమ్మతులకు గురయ్యాయి. వీటిని మరమ్మతులు చేయడం వల్ల పరిశ్రమల నిర్వహణకు మేలు కలుగుతుందని పారిశ్రామిక వర్గాలు చెబుతున్నాయి.

పారిశ్రామిక వేత్తలకు స్థలాల కేటాయింపు

ఏపీఐఐసీ శ్రీకాకుళం జిల్లా రామకృష్ణాపురంలో 60 ఎకరాలతో పరిశ్రమల కేంద్రాన్ని కొత్తగా ఏర్పాటు చేయనుంది. దీనికోసం 60 ఎకరాల భూములను సేకరించింది. నిర్వాసితులకు రూ.7 కోట్లను ఇప్పటికే చెల్లించింది. అర ఎకరా చొప్పున 70 ప్లాట్లుగా విభజించిన యంత్రాంగం రూ.10 నుంచి 12 కోట్ల ఖర్చుతో రోడ్లు, విద్యుత్, నీటి అవసరాలను తీర్చేందుకు సిద్ధమవుతోంది. పనులు పూర్తయిన వెంటనే ఆన్‌లైన్‌లో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుంచి దరఖాస్తులు ఆహ్వానించనుంది.

70 ప్లాట్లతో కొత్త పరిశ్రమల కేంద్రం

విజయనగరం, శ్రీకాకుళం జోన్ పరిధిలోని రామకృష్ణాపురంలో 60 ఎకరాల్లో 70 ప్లాట్లను సిద్ధం చేశాం. ఇప్పుడు ఆ ప్రాంతంలో అభివృద్ధి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. పనులు పూర్తయితే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తాం.

- యతిరాజు, జోనల్ మేనేజర్, ఏపీఐఐసీ

విద్యుత్ శాఖలో మరింత పర్యవేక్షణ

- కొత్తగా డివిజన్ ఏర్పాటు
- డివిజన్ ఏర్పాటుతో మంజూరు కానున్న ఈఈ పోస్టు


దాసన్న పేటలో ఉన్న విద్యుత్‌శాఖ కార్యాలయం

విజయనగరం ఫోర్ట్:

విద్యుత్‌శాఖలో పర్యవేక్షణ పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పర్యవేక్షణ చేసేందుకు వీలుగా విజయనగరంలో కొత్తగా డివిజన్‌ను ఏర్పాటు చేసింది. జిల్లాల పునర్విభజన తర్వాత శ్రీకాకుళం జిల్లాలో ఉన్న రాజాం డివిజన్ విజయనగరం జిల్లాలోకి వచ్చింది. విజయనగరం డివిజన్ పరిధి ఎక్కువగా ఉండడంతో రెండు డివిజన్‌లుగా చేశారు. కొత్త డివిజన్ ఏర్పాటు కావడం వల్ల పర్యవేక్షణ సులభతరం కానుంది. ఇంతకు ముందు ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పర్యవేక్షించేవారు. ఇప్పుడు ఇద్దరు పర్యవేక్షిస్తారు. కొత్త డివిజన్ ఏర్పాటుకు కొత్త ఈఈని కూడా ప్రభుత్వం నియమించింది.

విజయనగరం టౌన్ డివిజన్ పరిధి:
టౌన్‌డివిజన్ పరిధిలో విజయనగరం పట్టణం, నెల్లిమర్ల, గుర్ల, గంట్యాడ మండలాలు ఉన్నాయి. అదేవిధంగా రూరల్ డివిజన్ పరిధిలో భోగాపురం, డెంకాడ, పూసపాటి రేగ, రేగిడి ఆమదాల వలస, వంగర, సంతకవిటి, రాజాం, కొత్తవలస, వేపాడ, జామి, ఎస్. కోట, ఎల్.కోట మండలాలు ఉన్నాయి.

బొబ్బిలి డివిజన్ పరిధిలో:
బొబ్బిలి డివిజన్ పరిధిలో బొబ్బిలి సిటీ, బొబ్బిలి రూరల్, రామభద్రపురం, బొండపల్లి, దత్తిరాజేరు, గజపతినగరం, బాడంగి, తెర్లాం మండలాలు ఉన్నాయి. పార్వతీపురం డివిజన్ పరిధిలో పార్వతీపురం మండలం, బలిజిపేట, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, పాచిపెంట, మక్కువ, సాలూరు మండలాలు ఉన్నాయి.

విద్యుత్ సిబ్బంది సేవలు

వినియోగదారుల సమస్యలను సకాలంలో పరిష్కరిస్తున్నారా? లేదా? విద్యుత్ కనెక్షన్ కావాలన్న వారికి ఎన్ని రోజుల్లోగా ఇస్తున్నారు, విద్యుత్ సరఫరాలో లోవోల్టేజ్, హైఓల్టేజ్ సమస్యలు ఏమైనా ఉన్నాయా అనే అంశాలపై డివిజన్ ఈఈలు పర్యవేక్షిస్తారు.

ముద్దల లక్ష్మణరావు ,
విద్యుత్‌శాఖ ఎస్.ఈ

క్లుప్తంగా

పశువుల వ్యాన్ సీజ్


గజపతినగరం పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసిన పశువుల వ్యాన్

గజపతినగరం : దత్తిరాజేరు మండలం మరడాం గ్రామానికి చెందిన వాసుదేవరావు పది పశువులను అక్రమంగా అలమండ సంతకు వ్యాన్‌లో తరలిస్తూ పట్టుబడ్డాడు. ఈ మేరకు నిందితుడితో పాటు పశువుల వ్యాన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక ఎస్సై గంగరాజు సోమవారం సాయంత్రం తెలిపారు. పశువులను తరలిస్తున్న వాసుదేవరావును గజపతినగరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకుని ఆయనపై కేసును నమోదు చేసి వ్యాన్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు.

యువకుడి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన గుణ

శృంగవరపుకోట: పట్టణంలోని శ్రీనివాసకాలనీలో నివాసం ఉంటున్న యువకుడు తమిళనాడు రాష్ట్రంలోని ధర్మపురి మండలం తండా గ్రామానికి చెందిన పెరుమళ్ల గుణ(27) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఓ షాపు లీజుకు తీసుకుని హాట్ చిప్స్ పేరుతో వ్యాపారం సాగిస్తున్న గుణకు భార్య అభి, ఏడాది వయసున్న కుమార్తె ఉన్నారు. ఆదివారం రాత్రి యథాతథంగా భార్య, బిడ్డలతో గుణ నిద్రకు ఉపక్రమించాడు. అయితే అర్ధరాత్రి 1గంట సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్న భర్తను గమనించిన భార్య కిందికి దింపి తెల్లవారు జామున ఇరుగు పొరుగు వారికి సమాచారం ఇచ్చింది. విషయం తెలిసిన ఎస్.కోట పోలీసులు వచ్చి పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతుడి తండ్రి పెరుమాళ్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తారకేశ్వరరావు చెప్పారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ పరిధిలో రైలు నుంచి జారి పడి జంగేటి మణికంఠ(25) అనే యువకుడు మృతి చెందినట్లు జీఆర్‌పీ హెచ్‌సీ రమేష్ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం పట్టణంలోని జెండాల వీధికి చెందిన మణికంఠ ఆదివారం రాత్రి విశాఖపట్నం నుంచి ఆముదాలవలసకు ఈస్ట్ కోస్ట్ రైలులో ప్రయాణిస్తుండగా చీపురుపల్లి వచ్చే సరికి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు హెచ్‌సీ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..
చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి ఆర్‌ఓబీ సమీపంలో రైల్వే ట్రాక్‌పై రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి శరీరంపై గోధుమ రంగు కమీజు, నిక్కరు ఉన్నాయి. మృతుడికి సుమారు 60 ఏళ్లు ఉంటాయి. ఈ ఘటనకు సంబంధించి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ..


గుర్తు తెలియని మహిళ మృతదేహం

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట వద్ద జాతీయ రహదారిపై సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఈ ప్రమాదంపై పోలీసులు,స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రతిరోజూ మృతురాలు ఆరికతోట జంక్షన్ వద్ద భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగించేంది. ఈ ప్రమాదంపై పలువురు వాహనదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై అప్పారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు.ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పట్టుకునేందుకు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹135	₹240	₹250

సకాలంలో వినతుల పరిష్కారం

- కలెక్టర్ నాగలక్ష్మి ఎస్


అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, జేసీ మయూర్ అశోక్


ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్

విజయనగరం అర్బన్: ప్రజావినతులను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించని ప్రభుత్వ శాఖల అధికారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ స్పష్టం చేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్దేశిత కాల వ్యవధిలో పరిష్కరించాల్సిందేనని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సోమవారం ప్రజల నుంచి కలెక్టర్ నాగలక్ష్మి వినతులు స్వీకరించారు. అనంతరం ప్రజా వినతుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. వినతుల పరిష్కారంలో జాప్యం వద్దని పలు మార్లు స్పష్టం చేసినప్పటికీ పలుశాఖల వినతులు పెండింగ్‌లో ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్జీదారుల సంతృప్తి మేరకు పరిష్కరించిన వినతులపై ఆయా శాఖల అధికారులు, మండల ప్రత్యేక అధికారులు నివేదికలు అందించాల్సి ఉందన్నారు. వినతుల స్వీకరణ కార్యక్రమంలో సోమవారం పలు వర్గాల ప్రజల నుంచి 182 వినతులు అందాయి. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎస్.డి అనిత, భూసేకరణ అధికారులు వెంకటేశ్వరరావు, పద్మలత, సుదర్శన దొర తదితరులు పాల్గొని వినతులు స్వీకరించారు.

ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం
విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో ప్రజల నుంచి 37 ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. బాధితుల ఫిర్యాదులను స్వీకరించిన ఆమె సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, బాధితులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐలు కేకేవీ.విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

వినతులు పూర్తిస్థాయిలో పరిష్కరించాలి

- కలెక్టర్ నిషాంత్‌కుమార్


వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్


బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక అంశాలపై 98 అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులను ప్రతిష్టాత్మకంగా తీసుకుని శాఖలవారీగా పరిష్కరించాలని అధికారులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు, ఐటీడీఏ పీఓ సి.విష్ణు చరణ్, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథ రావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, డీపీఓ బి.సత్యనారాయణ, సీడీపీఓ ఎమ్ఎస్.రాణి, జిల్లా సహకార అధికారి సన్యాసి రావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి .నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వర న్యాయం
పార్వతీపురంటౌన్: ఫిర్యాదులపై సత్వర న్యాయం జరగాలని జిల్లా అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేధింపులు, కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదు దారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి బాధితులకు సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ, సీహెచ్.లక్ష్మణ రావు, డీసీఆర్‌బీ సీఐ ఎస్.వి.ప్రభాకర్ రావు, ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో జీఎంఆర్ విద్యార్థులకు ప్రథమ స్థానం


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రాజాం: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ విశాఖపట్నం నిర్వహించిన జాతీయ స్థాయి రోబో రంబుల్ పోటీల్లో స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థులు సత్తా చాటారు. విశాఖపట్నంలో అక్టోబర్ 13 నుంచి 15 వరకూ జరిగిన జాతీయ స్థాయి శాశ్వత్–2023లో భాగంగా నిర్వహించిన రోబో రంబుల్ ఫైనల్స్ పోటీల్లో జీఎంఆర్ ఐటీ ఈసీఈ విభాగం విద్యార్థులు కె.దిలీప్‌కుమార్, కె. గోపి, ఎస్.మహేశ్ ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారు. విద్యార్థులకు గైడ్ గా కళాశాల ఈసీఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ అనిల్‌కుమార్ వ్యవహరించారు. సత్తా చాటిన విద్యార్థులను జీఎంఆర్ ఐటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్‌లు సోమవారం అభినందించారు.

మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలి

- ఎంపీ బెల్లానచంద్రశేఖర్


భైరిపురంలో మొక్కలు నాటుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు

మెరకముడిదాం: మొక్కలు నాటడాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీ బెల్లానచంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని భైరిపురం గ్రామంలో ఎస్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాల, శ్రీహర డిగ్రీకళాశాలల ఆధ్వర్యంలో రిటైర్డ్ ప్రొఫెసర్ హరశ్రీరాములు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కలిసి నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతూ విద్యార్థిదశనుంచే సేవాకార్యక్రమాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. తమ గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో విద్యార్థుల భాగస్వామ్యం చాలా అవసరమని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నాయకులు తాడ్డివేణుగోపాలరావు, పప్పలకృష్ణమూర్తి, పప్పలజ్ఞానేశ్వరరావు, తాడేలఉమావెంకట మహేశ్వరరావు, ఎస్ ఇండియా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు హరశ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన లీగ్ మ్యాచ్‌లు


సర్, విజ్జీ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్

- కేరళ, బరోడా, మధ్యప్రదేశ్ విజయం
- అగ్రస్థానంలో మధ్యప్రదేశ్

విజయనగరం రూరల్: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలో గ్రూప్–ఈ విభాగంలో ఈ నెల 8 నుంచి జరుగుతున్న అంతర్ రాష్ట్ర అండర్- 19 మహిళల వన్డే క్రికెట్ టోర్నీలో లీగ్ మ్యాచ్‌లు సోమవారం ముగిశాయి. జిల్లాలోని మూడు వేదికల్లో సోమవారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లలో కేరళ, బరోడా, మధ్యప్రదేశ్ జట్లు జోరు చూపించాయి. గ్రూప్- ఈ విభాగంలో మధ్యప్రదేశ్, బరోడా, కేరళ, అసోం, బీహార్, మిజోరం జట్లు తలపడగా మధ్యప్రదేశ్ జట్టు ఆడిన 5 మ్యాచ్‌లలో 5 విజయాలు సాధించి 20 పాయింట్లతో గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. బరోడా జట్టు నాలుగు విజయాలు, కేరళ 3 విజయాలు సాధించగా అసోం రెండు విజయాలు, బీహార్ 1 విజయంతో నాలుగైదు స్థానాల్లో నిలవగా, మిజోరం జట్టు 5 పరాజయాలతో ఆఖరిస్థానంలో ఉంది. ఈ నెల 20 నుంచి ప్రి క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

పామాయిల్ తోటల పెంపకంపై రైతుల ఆసక్తి


బూర్జ నుంచి ట్రాక్టర్‌తో పామాయిల్ గెలలు తరలిస్తున్న రైతులు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం మూతపడడంతో చెరకు సాగు చేసే పొలాల్లో ప్రత్యామ్నాయంగా పామాయిల్ తోటల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. కర్మాగారం పరిధిలో ఉన్న బొబ్బిలి, సీతానగరం తదితర 6 మండలాల్లో రైతులు 65 సంవత్సరాలుగా 15 వేలనుంచి 20 వేల ఎకరాల్లో ఆనవాయితీగా చెరకు సాగు చేసేవారు. చక్కెరకర్మాగారం మూతపడడం, దూర ప్రాంతానికి చెరకును తరలించడానికి చిన్నసన్నకారు రైతులు వ్యయప్రయాలు పడలేక వాణిజ్యపంటగా పామాయిల్ తోటలు వేయడం ఆరంభించారు. రైతులు పామాయిల్ తోటల పెంపకానికి ఆసక్తి చూపడం వల్ల బగ్గందొరవలసలో శ్రీనివాసా పామాయిల్ మిల్లు యాజమాన్యం నర్సరీ ఏర్పాటు చేసి, ప్రభుత్వం నుంచి అందే రాయితీపై రైతులకు మొక్కలు పంపిణీ చేస్తోంది. దీంతో పామాయిల్ ప్లాంటేషన్‌కు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ విషయమై బగ్గందొరవలస పామాయిల్ నర్సరీ ఇన్‌చార్జ్ కె.శ్రీనివాస రావు వద్ద ప్రస్తావించగా 2023–24 సీజన్‌లో రైతులు 2,800 ఎకరాల విస్తీర్ణంలో పామాయిల్ ప్లాంటేషన్ చేపట్టినట్లు తెలియజేశారు.

పార్వతీపురంలో డిప్యూటీ సీఎం ప్రత్యేక పూజలు


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్:

ప్రముఖ నాడీ జ్యోతిష్యుడు మురపాక కాళిదాసు యాజీ ఆధ్వర్యంలో శ్రీ సర్వమంగళా విద్యాపీఠంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర సోమవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాయత్రి దేవి రూపంలో అమ్మవారిని ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని ప్రత్యేక పూజలు చేసి కోరుకున్నారు. శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలని హితవు పలికారు.

అమ్మవారిని దర్శించిన ఎమ్మెల్యే
పార్వతీపురం పురపాలక సంఘం పరిధి కొత్తవలస ఫ్లైఓవర్ పక్కన కొలువై ఉన్న శ్రీ దుర్గా మాత ఆలయాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు, ప్రజా ప్రతినిధులతో కలిసి సోమవారం సందర్శించి దుర్గామాతను దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే జోగారావును ప్రముఖ నాడీ జోతిష్యుడు మురపాక ఖాళిదాసు శర్మ యాజీ వేద పండితులతో కలిసి పూర్ణ కలశంతో ఘనంగా ఆహ్వానించి అమ్మవారి ప్రత్యేక దర్శనం చేయించి, ఆశీర్వాదం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివిధ చోరీకేసుల్లో నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు(వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: వివిధ చోరీకేసుల్లో నిందితుడ్ని వన్‌టౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు సీఐ బి.వెంకటరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక సిటీబస్టాండ్ వద్ద నున్న స్క్రాప్ షాపులో గుర్తుతెలియని వ్యక్తులు షాప్ షట్టర్ ఓపెన్ చేసి అందులో ఉన్న అల్యూమినియం, రాగి, ఇత్తడి గోనెసంచుల మూటలు పట్టుకుపోయారని బాధితుడు శేఖర్ వన్‌టౌన్ పోలీసులకు ఈ నెల 9వ తేదీన ఫిర్యాదుచేశాడు, ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు అయ్యన్నపేట జంక్షన్‌లో అంజూర్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. నిందితుడి దగ్గర నుంచి రాగి, ఇత్తడి మూటలను స్వాధీనం చేసుకున్నారు. అయితే కేసులో మరో నిందితుడు దుర్గాప్రసాద్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అంజూర్ కుమార్ గతంలో శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో ఒక బైక్, భీమిలిలో మరో బైక్ చోరీచేసినట్లు విచారణలో అంగీకరించాడు, సమావేశంలో ఎస్సై అశోక్ కుమార్ , తదితరులు పాల్గొన్నారు.

సారా పట్టివేత


సారా నిందితులతో ఎస్సై కళాధర్

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ పరిసర ప్రాంతాలలో సోమవారం 6 ట్యూబ్‌లలో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా సారా తరలిస్తుండడంతో వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై కళాధర్ తెలిపారు. ట్యూబ్‌లలో సారా తరలిస్తున్నట్లు స్థానికులు తెలియజేసిన సమాచారం మేరకు కాపుకాసి నిందితులను అదుపులోకి తీసుకుని 240 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఈవీఎంల తనిఖీ ప్రారంభం

పార్వతీపురంటౌన్: ఈవీఎంల తనిఖీ పార్వతీపురం మన్యం సోమవారం ప్రారంభమైంది. ఈ ప్రక్రియను కలెక్టర్ నిషాంత్ కుమార్ పరిశీలించారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈవీఎంల మొదటి దశ తనిఖీలను బెంగళూరుకు చెందిన బీఈఎల్ ఇంజినీర్లు సుమారు 20 రోజుల పాటు నిర్వహించనున్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఉన్న సందేహాలు, అపోహల నివృత్తికి మొదటి దశ ఈవీఎంల తనిఖీకి ప్రతిరోజూ హాజరు కావాలని ప్రజాప్రతినిధులకు కలెక్టర్ సమాచారం అందజేశారు. ఈవీఎం గోదాముల వద్ద భద్రత, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఈవీఎంల తనిఖీల నిర్వహణ సమయంలో మొబైల్ ఫోన్లను అనుమతించలేదు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో విధిగా డిపాజిట్ చేశారు. ఈ ప్రక్రియను జిల్లా అధికారులు పర్యవేక్షించారు.